



పత్తి రైతుకు గడ్డుకాలం

సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం

పత్తి విక్రయాల సీజన్ మొదలవుతోంది. గిట్టుబాటు ధరపై రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుందనే భరోసాతో ఉన్నారు. కానీ వాస్తవం వేరుగా ఉంది. గిట్టుబాటు ధర లేక కర్షకులు డీలా పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ పత్తికి రూ.8,110 మద్దతు ధర ప్రకటించినప్పటికీ సీసీఐ కొనుగోళ్లు లేకపోవటంతో దళారులకు వరంగా మారింది. ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి వస్తున్న కొత్తపత్తికి క్వింటాల్‌కు రూ.3వేల నుంచి రూ.7వేలలోపే ధర పలుకుతోంది. తేమ, తాలు, బెండు తదితర వాటి పేరిట దళారులు పత్తి ధరకు కోత పెడుతున్నారు. అకాల వర్షాలతో చేతికి వచ్చిన పత్తిని ఇంట్లో, చేల్లో నిల్వ చేసుకుని పరిస్థితి లేక దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. అక్టోబరు 1వ తేదీ నుంచే సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తుందని ప్రచారం జరిగినప్పటికీ జిన్నింగ్ మిల్లుల జాబ్‌వర్క్ టెండర్లలో పాల్గొనకపోవటంతో ఇప్పట్లో సీసీఐ కొనుగోళ్లు జరిగేనా? అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తం అవుతున్నాయి.

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పత్తి రైతుకు ధరల టెన్షన్ పట్టుకుంది. యూరియా కొరత, అకాల వర్షాలతో చిత్తైనా అన్నదాతకు గిట్టుబాటు ధర కన్నీళ్లు తెప్పిస్తోంది. ఎన్నిసార్లు నష్టపోయినా.. ఎన్ని అప్పులైనా ఎన్నో ఆత్మహత్యలు జరిగినా.. ఎందుకో రైతుకు పత్తి పంటపైనే మక్కువ. రాష్ట్రంలో అత్యధికంగా ఉమ్మడి జిల్లాలోనే రైతులు పత్తి సాగుచేస్తున్నారు. 2023-24లో ఉమ్మడి జిల్లాలో 5.13లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, 2024-25లో 5,13,289 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఈసారి 2025-26లో కూడా 5,14,904 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. గత ఏడాది కంటే స్వల్పంగా పత్తిసాగు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెరిగింది. వరుస నష్టాలను ఎదుర్కొంటున్నప్పటికీ రైతులు ఇతర వాణిజ్య పంటలకంటే పత్తి వైపే మొగ్గు చూపుతున్నారు. వరంగల్ జిల్లాలో 1,18,547 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. అలాగే హనుమకొండ జిల్లాలో 74,849 ఎకరాల్లో, మహబూబాబాద్ జిల్లాలో 82,639 ఎకరాలు, జనగామ జిల్లాలో 1,20,016 ఎకరాల్లో, భూపాలపల్లి జిల్లాలో 98,260 ఎకరాల్లో, ములుగు జిల్లాలో అత్యల్పంగా కేవలం 20,593 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 5,14,904 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తుండగా, 4,11,923 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

- **కొత్త నింబంధనలతో జాబ్‌వర్క్ టెండర్లకు దూరంగా జిన్నింగ్ మిల్లులు**
- **దళారులకు వరంగా మారిన కొత్త పత్తి కొనుగోళ్లు**
- **క్వింటాల్‌కు రూ.3వేల నుంచి రూ.7వేల వరకే ధర**
- **తేమ, తాలు, బెండు పేరుతో భారీగా ధరలకు దళారుల కోత**
- **వర్షాలకు నిల్వ చేసుకునే పరిస్థితి లేక తక్కువ ధరకు అమ్మకాలు**
- **కేంద్రం ప్రకటించిన రూ. 8,110 మద్దతు ధర ఎక్కడో...**
- **తెగని సీసీఐ, జిన్నింగ్ మిల్లుల నిబంధనల లొల్లి**



సీసీఐ వర్సెస్ జిన్నింగ్ మిల్లర్లు

సీసీఐ కొత్త నిబంధనలు కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 2022లో క్వింటాల్ పత్తికి రూ.14వేల ధర ఉండగా, అంతర్జాతీయ పరిణామాలతో పత్తి ధరలు భారీగా పడిపోయాయి. దీంతో రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కోసం సీసీఐపై ఆధారపడుతున్నారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 58 జిన్నింగ్ మిల్లులను మార్కెటింగ్ శాఖ గుర్తించింది. వీటిలోనే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. 2023-24లో ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా సీసీఐ ద్వారా 22,11,873.78 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా, (మిగతా 7వ పేజీలో)



పెట్టుబడి వచ్చేలా లేదు..

రెండు నెలలుగా కురుస్తున్న అకాల వర్షాలతో పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. తెగుళ్లతో పత్తి పూత, కాత, ఆకులన్నీ రాలిపోతున్నాయి. ఎకరాకు రూ.50వేలకు పైగా పెట్టుబడి పెట్టినప్పటికీ 5క్వింటాల్ పత్తి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. దళారుల చేతిలో పత్తిని పెడితే కనీసం కూలీలకు ఇచ్చిన కూలీ డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం సీసీఐ ద్వారా రూ.8,110మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

- ర్యాకం రవీందర్, రైతు చిట్యాల, భూపాలపల్లి జిల్లా

రద్దీగా ఆర్టీసీ బస్సులు



మానుకోట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు

- **జనం తిరుగు ప్రయాణం**
- **ముగిసిన దసరా సెలవులు**
- **పట్టణాల బాట పట్టిన ప్రజలు**

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ, దసరా సెలవులు ముగియడంతో పండుగకు సొంత ఊళ్లకు వచ్చిన జనం తిరుగు ముఖం పడుతున్నారు. సెలవులకు పల్లెలకు వచ్చిన వారంతా తిరిగి పట్టణాలకు పయనమయ్యారు. దీంతో 15 రోజుల పాటు జనంతో సందడిగా ఉన్న పల్లెలు బోసి బోతున్నాయి. సెప్టెంబరు 20 నుంచి అక్టోబరు 3 వరకు పాఠశాలలకు బతుకమ్మ, దసరా సెలవులు ఇవ్వడంతో పట్టణాల్లో చదివే విద్యార్థులతో పాటు, ఉద్యోగ రీత్యా అక్కడక్కడ స్థిరపడ్డ వారంతా తమ పిల్ల పాపలతో సొంత ఊళ్లకు చేరుకున్నారు. సెప్టెంబరు 29న సద్దుల బతుకమ్మ, అక్టోబరు 2న దసరా పండుగ ఉండడంతో పట్టణాల్లో ఉద్యోగాలు చేసేవారు సైతం గ్రామాలకు చేరుకున్నారు. ఈనెల 3వ తేదీతో పాఠశాలలకు సెలవులు ముగిసి 4న పునఃప్రారంభం కావడంతో పండుగకు పల్లెలకు వచ్చిన వారంతా పట్టణాలకు పయనమయ్యారు. ఈనెల 5వ తేదీన ఆదివారం సెలవు కావడంతో ఆ రోజు కూడా ప్రయాణాలు సాగించనున్నారు. సెలవులు ముగియడంతో గత రెండురోజుల నుంచి వరుసగా ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు, రైళ్లు కిక్కిరిసి పోతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణమంతా శనివారం ఎటు చూసినా ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం ప్రయాణాలు మరింత పెరగనున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సుల సంఖ్యను పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజలకు చేరువలో న్యాయసేవలు

జిల్లా కోర్టు అదనపు సీనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్ 8



లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభిస్తున్న సివిల్ జడ్జీ కృష్ణతేజ్



బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రెడ్యానాయక్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

కురవి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచి, సత్తా చాటాలని మాజీమంత్రి, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ పిలుపునిచ్చారు. సీరోలు మండల కేంద్రంలో శనివారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే కాంగ్రెస్ తీవ్ర ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ప్రతీనెల మహిళలకు రూ.2500 ఇస్తామని నేటికి ఇవ్వడం లేదని విమర్శించారు. అన్ని పార్టీలు 42 శాతం రిజర్వేషన్‌కు మద్దతు ఇస్తున్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరే బీసీలపై అభిమానం ఉన్నట్లు మాట్లాడడం విడ్డూరమన్నారు. బీఆర్ఎస్ ఆశావహులందరూ స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, తోట లాలయ్య, గుగులోతు రవినాయక్, కొండపల్లి శ్రీదేవి, పెద్ది వెంకన్న, హైమావతి, తోట రమేష్, బోజ్యానాయక్, మోహన్‌నాయక్, మామిండ్ల వెంకన్న, దొంగరి నర్సయ్య, కళమ్మ, సముద్రాల శ్రీను, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అన్ని స్థానాల నుంచి బీజేపీ పోటీ

- **ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను బరిలో నిలుపుతాం**
- **పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు**



కేసముద్రంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కేసముద్రం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని ఎంపీటీసీ, సర్పంచ్, జడ్పీటీసీ, వార్డు సభ్యుల స్థానాల్లోంచి బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తారని పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు తెలిపారు. కేసముద్రంలో శనివారం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల ప్రతినిధి మేరెడ్డి సురేందర్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి, లీగల్‌సెల్ కన్వీనర్ తుంపిళ్ల శ్రీనివాస్, బోనగిరి ఉపేందర్, చెలగోల వెంకటేష్, నాగరబోయిన చంద్రకళ, రామడుగు వెంకటాచారి, బజ్జూరి వీరభద్రాచారి, గాంతి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్

- **బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలి**
- **మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కాసాని ఐలయ్య, గుగులోతు రాగుర్, గుగులోతు చందా, గుగులోతు కిష్టు, యాకన్న, సంపత్‌తో పాటు పలువురు మాజీమంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అట్టర్‌ప్లాప్ అయ్యిందని, ఏడాదిన్నరలోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని ధ్వజమెత్తారు. పాలన చేతకాక, ఇచ్చిన హామీలు అమలు చేయలేక మూడున్నరేళ్ల ముందే కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నుడుస్తున్నది ప్రజాపాలన కాదని.. పేదప్రజలను దోచే పాలన నడుస్తున్నదని తెలిపారు. గతంలో కేసీఆర్ రాష్ట్రంలోని ప్రజలు బీఆర్ఎస్, కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని, 420 హామీలు గాలిలో కలిశాయని, ఆ పార్టీపై ప్రజలకు విశ్వాసం పోయిందని మండిపడ్డారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ప్రతీ రైతును ఆదుకున్నామని, సబ్బండ వర్గాలకు అండగా నిలిచామని తెలిపారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను, ఆ పార్టీ దొంగ హామీలను ప్రజల్లో ఎండగట్టేది బీఆర్ఎస్సేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వి.రామచంద్రయ్య, శ్రీరాం సుధీర్, యాదగిరిరావు, శ్రీరాం సంజయ్, సర్దెండి సుధాకర్, భాస్కర్, సమ్మయ్య, వీరన్న, వెంకన్న, కుమారస్వామి, ఉషయ్య, శ్రీనివాస్, కోట అశోక్, రవికుమార్, రాము, హరీశ్, మహేశ్, కుమార్, అనుదీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

‘భౌతిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు’

తొర్రూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు, వ్యాపార సంస్థలపై భౌతిక దాడులకు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తొర్రూరు ఎస్సై ఉపేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా పండుగ రోజు మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన నలమాస ప్రశాంత్ బైక్ పైనుంచి పడి తీవ్రగాయాలు కావడంతో తొర్రూరులోని నిర్మల హాస్పటల్‌కు చికిత్స కోసం వచ్చి ఆస్పత్రి సిబ్బందితో గొడవపడ్డాడు. అనంతరం మిత్రులకు సమాచారం ఇవ్వగా నలమాస గణేష్, సంపత్, వంగ గణేష్ ఆస్పత్రికి వచ్చి, ఆస్పత్రి సిబ్బందిపైన, డ్యూటీ డాక్టర్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపర్చి, ఆస్తినష్టం చేశారు. దీంతో ఆస్పత్రి సిబ్బంది నారాయణ ఫిర్యాదు మేరకు నలమాస ప్రశాంత్, నలమాస గణేష్, సంపత్, వంగ గణేష్‌పై కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట శనివారం హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారని తెలిపారు.

‘ఎన్నికల నిర్వహణకు సహకరించాలి’



రాజకీయ పార్టీ నాయకులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో మంగమ్మ

గార్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఎంపీడీవో మంగమ్మ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పక్షాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే పార్టీ అభ్యర్థులు సమన్వయంతో పని చేయాలన్నారు. అభ్యర్థులు పోటీచేసే సమయం నుంచి జమ ఖర్చులు నమోదు చేయాలన్నారు. కందునూరి శ్రీనివాస్, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, పానుగంటి రాధకృష్ణ, జంపాల వెంకన్న తాళ్లపల్లి కిష్టాగౌడ్, విమల్‌కుమార్ జైన్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచాలి..

స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో ఎస్సీ, బీసీ వర్గాల ప్రజలకు జనాభా దామాష ప్రకారం రిజర్వేషన్లు ప్రకటించాలని కోరుతూ మండల అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు ఎంపీడీవో మంగమ్మకు వినతిపత్రం అందజేశారు. గత రిజర్వేషన్లకు బదులు ఈ సారి కొన్ని వర్గాకు తీరని అన్యాయం జరిగే విధంగా రూపొందించడం జరిగిందని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వం పరిశీలించి, అన్ని కులాలకు న్యాయం జరిగే విధంగా రిజర్వేషన్లు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, కాంగ్రెస్, న్యూడెమోక్రసీ, టీడీపీ, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కందునూరి శ్రీనివాస్, తాళ్లూరి శ్రీనివాస్, ముదులాకర్ శివాజీ, పానుంగటి రాధాకృష్ణ, జంపాల వెంకన్న మీగడ శ్రీనివాస్, తోడేటి శ్రీనుగౌడ్, నాగరాజు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి

- **రైతులకు రుణమాఫీ చేయడంలో విఫలం**
- **మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్**

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి, వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. రాయపర్తి మండలం ఊకల్‌లో మహబూబాబాద్ మండలం ఇంద్రానగర్ జీపీకి చెందిన 100 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్, వార్డుసభ్యులు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. వేమునూరు ఉమ్మడి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ వాంకుడోతు సరోజ బాలాజీనాయక్, మాజీ ఉప సర్పంచ్ శివలాల్, మాజీ వార్డుసభ్యులతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోస పూరిత వాగ్దానాలతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక ప్రజలను విస్మరించారని విమర్శించారు. రైతులకు సన్నవడ్లకు క్వింటాకు రూ.500 బోనస్, రైతుబంధు, రుణమాఫీ పూర్తిస్థాయిలో అందించలేదని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయదుందుభి మోగిస్తుందన్నారు. లూనావత్ అశోక్‌నాయక్, నలమాస శ్రీనివాస్, నలమాస సాయి, ఎమ్డీ.షరీఫ్, వెంకటేశ్వర్లు, అంగోతు కిషన్, భూక్య మల్సూరు, బాలు, శంకర్, లాలు, వాల్యా పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి



హరిపిరాల ఎంపీటీసీ క్లస్టర్ సమావేశంలో కాంగ్రెస్ బాకీ కార్డులను విడుదల చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొర్రూరు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపు నిచ్చారు. శనివారం మండలంలోని హరిపిరాల, వెల్లికట్టె ఎంపీటీసీ క్లస్టర్ పరిధిలోని బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశానికి హాజరై కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ అంటూ చట్టపరంగా చెల్లని జీవోతో ఎన్నికల ప్రకటన చేసి మోసం చేయాలని చూస్తుందని ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రభుత్వం అబద్ధపు హామీలతో గద్దెనెక్కిందని, ప్రభుత్వం ఇచ్చిన బాకీ కార్డులను విడుదల చేస్తూ ప్రజలకు అవగాహన కలిపించారు. ఎన్నికలు ఆలస్యంతో గ్రామాలు నిర్వీర్యం అవుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సీతారాములు, మాజీ ఎంపీపీ అంజయ్య, జడ్పీటీసీ శ్రీనివాస్, ప్రమోద్ కుమార్, కుర్ర శ్రీనివాస్, అంకూస్, కొండ వెంకన్న, పోసాని రాములు, బత్తుల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు బీజేపీ రెడీ

మరిపెడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు రెడీగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గుగులోత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం మరిపెడ మండల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జరుగగా శంకర్‌నాయక్ హాజరై మాట్లాడారు. నరేంద్ర మోదీతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ప్రతీ పల్లెలో తమ పార్టీ క్యాడర్ ఇప్పుడు ఎంతో బలంగా ఉందన్నారు. త్వరంలో జరగబోయే స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సంసిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే గెలుపన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలోని అన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు పోటీలో ఉంటారని, వారి గెలుపుకోసం ప్రతీ కార్యకర్త సైనికుడి వలే పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు దేవిక, బీజేపీ మరిపెడ మండల పార్టీ అధ్యక్షుడు కట్టోజ్ గంగాధర్, నాయకులు బింగీ రమేశ్, సుధాకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఈకేవైసీ ఉంటేనే.. ఉపాధి

● ఇక నకిలీ హాజరుకు చెక్

దంతాలపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో నకిలీ హాజరుకు చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ఉపాధి కూలీలకు తప్పక ఈకేవైసీని చేసుకోవాలని సూచించింది. దీంతో హాజరు విధానంలో పారదర్శకత పెరిగి నకిలీ హాజరు నమోదుకు చెక్‌పడుతుందని అధికారులు భావిస్తోంది. గతంలో కార్మికుల నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. కానీ కొందరు నకిలీ ఫోటోలతో ఒకరి బదులు మరొకరు వచ్చినట్లు ప్రభుత్వం గుర్తించినట్లు తెలిసింది. మరో వైపు సామాజిక తనిఖీలో సైతం బయటబడ్డ అక్రమాలపై చర్యలు కానరావడం లేదు. వీటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ యాప్ తీసుకొచ్చింది. దీనిని సైతం దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించింది. అర్హులకు ఆశించిన స్థాయిలో ఉపాధి, వేతనం దక్కడం లేదు.

రెండు సార్లు ఫోటోలు తీయాలి..

గ్రామాల్లో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను క్షేత్ర సహాయకులు సెప్టెంబరు 25 నుంచి ఇంటింటా తిరుగుతూ ఈ-కేవైసీ నమోదు చేస్తున్నారు. దీని ప్రకారం పనులకు వచ్చిన వెంటనే కార్మికుల ఫోటోలను చరవాణితో తీసి అప్‌లోడ్ చేస్తారు. నాలుగు గంటల తర్వాత మరో ఫోటో తీసి అప్‌లోడ్ చేస్తారు. అయితే ఒకే వ్యక్తి రెండు ఫోటోల్లో ఉంటేనే కూలీ డబ్బు అందుతాయి.



బీరిశెట్టిగూడెంలో ఈకేవైసీ చేస్తున్న క్షేత్ర సహాయకుడు జగన్

ప్రక్రియ ఇలా..

ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డులో నమోదై ఉన్న క్రియాశీల కార్మికులకు ఎన్ఎంఎంఎస్ మొబైల్ యాప్, ఫేస్ యాప్ ద్వారా ఈ-కేవైసీ చేస్తున్నారు. చక్కటి వెలుతురు, అంతర్జాలం ఉన్న ప్రదేశంలో చరవాణితో మాత్రమే ఫోటోలు తీయాలి. క్షేత్ర సహాయకులు లేదా సీనియర్ మేట్‌లు ఈ ప్రక్రియను పర్యవేక్షించి పూర్తి చేయాలి.

ఈ-కేవైసీపై రాని స్పష్టత..

ఈప్రక్రియ పూర్తికావడంతోనే మొత్తం జాబ్‌కార్డుల సంఖ్యతో పాటు ఈ-కేవైసీ నమోదైన సంఖ్య వివరాలను జిల్లా సంబంధిత అధికారులు వెల్లడిస్తారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వేణుమాదవ్

పెద్దవంగర, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): జరగబోయే స్థానిక ఎన్నికల ప్రక్రియకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో వేణుమాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. నామినేషన్ ప్రక్రియ నుంచి ఎన్నికల ఫలితాల వరకు నిబంధనలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు నాయకులు సహకరించాలన్నారు. మండలంలోని 25,409 ఓటర్లు, వారిలో స్త్రీలు 12,898, పురుషులు 12,511 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లష్కర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై ఉపేందర్

ఎన్నికల పట్ల అవగాహన కలిగి ఉండాలి

తొర్రూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ నాయకులు ఎన్నికల నిర్వహణ, నామినేషన్‌లు, పోటీ చేయుటకు కావాల్సిన నియమ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తొర్రూరు ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయుటకు ఆసక్తి గల అభ్యర్థులకు తగు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో పోటీ చేయు అభ్యర్థులు నియమ నిబంధనలు పాటిస్తూ ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు. నిబంధనల మేరకే ఎన్నికల్లో పోటీ చేయాలని, సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తూ అనుమానిత వ్యక్తులను ముందుగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయనున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ నర్సయ్య, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శులు రికార్డులను భద్రపర్చుకోవాలి



దంతాలపల్లి జీపీలో రిజిస్టరును పరిశీలిస్తున్న ఎంపీవో మహ్మద్ అప్సరపాషా

దంతాలపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులు జీపీ రికార్డులను అప్రమత్తంగా వ్యవహరిస్తూ భద్రపర్చుకోవాలని ఎంపీవో మహ్మద్ అప్సరపాషా అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జీపీ పన్నుల వసూళ్లు, వారంతపు సంతపై ఆరా తీశారు. వారంతపు సంతలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని జీపీ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యర్శులు మల్లికార్జున్, ఏశబోయిన వెంకన్న, సిబ్బంది యాకన్న, కారోబార్ యాకన్న తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం మరొకరికి ప్రాణదానం



నేత్రాలను సేకరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తొర్రూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం మరొకరికి ప్రాణదానమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాంనర్సయ్య అన్నారు. శనివారం తొర్రూరు పట్టణ కేంద్రంలో శ్రీరామ ప్రింటర్స్ నిర్వాహకుడు వేమిశెట్టి రాము తల్లి భాగ్యలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె నేత్రాలను లయన్స్ క్లబ్‌కు దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానం చేయడం వల్ల మరో ఇద్దరికి చూపు ప్రసాదించిన వారు అవుతారని, నేత్రదానం వల్ల కార్నియర్ అంధత్వంతో బాధపడుతున్న వారికి, దృష్టిలేని వారి జీవితాలను వెలుగులోకి తీసుకురావచ్చని తెలిపారు. లయన్ డాక్టర్ కిరణ్ కుమార్ నేత్రాలను సేకరించి ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి పంపించారని తెలిపారు. భాగ్యలక్ష్మి దహన ఖర్చులకు క్లబ్ ఆధ్వర్యంలో రూ.10వేలు అందించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ చిదిరాల నవీన్, సెక్రెటరీ రవీందర్ రెడ్డి, ట్రెజరర్ శ్రీనివాస్, మచ్చ సురేష్, ఇమ్మడి రాంబాబు, శ్రీను, క్లబ్ సభ్యులు ఉన్నారు.

చౌటకుంటలో పడి యువకుడు మృతి



మల్సూర్ (ఫైల్)

పెద్దవంగర, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామ శివారులో ప్రమాదవశాత్తు చౌటకుంటలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల, బాధిత కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం.. పోచారం గ్రామ శివారు భద్రుతండాకు చెందిన బానోతు మల్సూర్ (25) మతిస్థిమితం లేక భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తు న్నాడు. గత 5 సంవత్సరాల కిందట ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైర్లు బానోతు మల్సూర్ చేతులకు తాగలడంతో రెండు చేతులు కాలిపోవడంతో మతిస్థిమితం కోల్పోయాడు. శుక్రవారం సాయంత్రం మలమూత్ర విసర్జన కోసం చౌటకుంట వైపు వెళ్లిన క్రమంలో ప్రమాదవశాత్తు కుంటలో పడి మునిగిపోయాడు. శనివారం బానోతు మల్సూర్ మృతదేహం లభ్యమైంది. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఘటనకు సంబంధించి ఎలాంటి పిర్యాదు అందలేదన్నారు.

సేవే ఊపిరిగా..

● పల్లెల రూపురేఖలు మార్చే యజ్ఞంలో మునుముందుకు...
● గూడూరు మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు
● విద్య, వైద్యం, ఆధ్యాత్మిక, పర్యావరణానికి తన వంతు సాయం
● రాజకీయ, సామాజిక రంగాల్లో బుడిగె సతీష్‌గౌడ్ తనదైన ముద్ర



భారత్ జోడోయాత్రలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డితో బుడిగె సతీష్‌గౌడ్ (ఫైల్)

గూడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవే ఊపిరిగా నిబద్ధత, నిజాయితీతో ముందుకుసాగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు బుడిగె సతీష్‌గౌడ్. తాను చిన్నతనంలో అనుభవించిన కష్టాలు, పేదరికాన్ని ఆయన మరిచిపోలేదు. స్వయంకృషితో ఆర్థికంగా స్థిరపడిన క్రమంలో తాను సంపాదించిన దానిలో కొంత సమాజానికి ఇవ్వాలనే తలంపుతో 'శ్రీమంతుడు'గా ప్రజలకు సేవ చేస్తూ, రాజకీయంగా ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ అందరి మన్ననలు పొందుతున్నారు.

యువత, విద్యార్థులు, పేదలకు, వృద్ధులకు సామాజిక సేవా చేయాలన్న లక్ష్యంతో విద్యా, విజ్ఞానం, ఆరోగ్యం, పర్యావరణ తదితర రంగాల్లో ఆయన సేవలు ముందుకు సాగుతున్నాయి. ఏజెన్సీ గ్రామాల రూపురేఖలు మార్చడానికి కృషి చేస్తున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పిలుపులో భాగంగా డిజిటల్ సభ్యత్వ నమోదులో తెలంగాణ రాష్ట్రంలోనే గూడూరు మండలంలో అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేశారు.

సతీష్‌గౌడ్‌కు ఒక్క సామాజిక సేవకే పరిమితం కాలేదు. ఆయన పర్యావరణ ప్రేమికుడు కూడా. రైతు కుటుంబానికి చెందిన ఆయనకు చెట్లంటే ప్రాణం. సుమారు ఎకరం విస్తీర్ణంలో ఇల్లు కట్టుకుని ఆవరణలో వందల రకాల చెట్లను పెంచుతున్నారు. పెరట్లో కూరగాయలను పండిస్తున్నారు. క్రిమిసంహారక మందులు లేకుండా పండిస్తున్న ఈ కూరగాయలతో ఆరోగ్యంగా ఉన్నామని చెబుతున్నారు.

కాంగ్రెస్ అగ్రనాయకులతో..

పార్టీలో నిబద్ధతతో పనిచేసే నాయకుడిగా సతీశ్‌గౌడ్ గుర్తింపు పొందారు. ఆయనకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్రకాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో సత్సంబంధాలుండటం విశేషం. ఇంకా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వర్ రావు, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మాధవపెద్ది రమేషచందర్‌రెడ్డి ఇలా అనేకమంది నేతలతో సతీశ్‌గౌడ్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. వారి సహకారంతో పార్టీ బలోపేతం కోసం గూడూరు మండలంలో తనవంతు కృషి చేస్తున్నారు.

సతీష్ సేవా కార్యక్రమాలు..

- గూడూరులో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే దసరా వేడుకలకు ప్రతీ సంవత్సరం రూ.50 వేల ఆర్థిక విరాళం.
- అంబేద్కర్ విగ్రహ పునర్‌ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రూ.25 వేల విరాళం.
- శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామీణ క్రీడలకు యేటా రూ. 25 వేలు.
- గూడూరు, మచ్చర్ల, ఇప్పల్‌తండా, ఏపూరు, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో వినాయక ఉత్సవాలకు ఆర్థిక విరాళాలు.
- బ్రాహ్మణపల్లిలో కస్తూర్బాలో 250 మంది విద్యార్థినుల దాహార్తిని తీర్చేందుకు రూ.30 వేలు వెచ్చించి వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు.
- ప్రాథమిక పాఠశాల సుందరీకరణ, మరమ్మతుల కోసం ఆర్థిక విరాళం.
- గూడూరు మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన గిరిపుత్రిక కొట్టెం కుసుమాంజలి మెడిసిన్‌లో సీటు సాధించడంతో ఆమెకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.
- కొత్తగూడ మండలం వేలుబెల్లి తండాకు చెందిన మాటలు రాని దివ్యాంగురాలు ఓ ప్రమాదంలో శరీరం కాలిపోవడంతో ఆమె వైద్యం కోసం రూ.20 వేలు అందించారు.
- గూడూరు మండలం ఉప్పల్‌తండాలో దుర్గమ్మగుడి నిర్మాణానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.
- వయానాడ్ వరద బాధితులకు మంత్రి సీతక్క ద్వారా రాహుల్‌గాంధీకి రూ.50 వేల చెక్కును అందించారు.
- గత సంవత్సరం ములుగు జిల్లా వరద బాధితులకు తన స్నేహితుల సాయంతో 20 క్వింటాళ్ల బియ్యాన్ని బాధితులకు అందించేందుకు మంత్రి సీతక్కకు అందించారు.
- గూడూరు మండలం బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం రూ.20 వేలు, ముత్యాలమ్మగుడి మరమ్మతులు, వాటర్ సౌకర్యం, సుందరీకరణ పనుల నిర్వహణ కోసం రూ.6.10 లక్షలు, గౌడ కులస్తుల ఆరాధ్యదైవం కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు.



బ్రాహ్మణపల్లిలో ఆర్థిక సాయం అందిస్తున్న సతీష్‌గౌడ్ (ఫైల్)

స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి



అయ్యగారిపల్లిలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

కురవి, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి) : పొత్తులతో సంబంధం లేకుండా స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలని ఆత్మ చైర్మన్, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. కురవి మండలం అయ్యగారిపల్లిలో సీపీఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ప్రాతినిధ్యం పెంచే విధంగా పోటీకి సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఐని ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, బొల్లు వెంకన్న, కందుల యాకయ్య, గురువయ్య, చిన్న వీరయ్య, గజ్జి చంద్రయ్య, శ్రీను పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



గుండంపల్లిలో చెక్కులు అందజేస్తున్న బిట్ల శ్రీనివాస్

కొత్తగూడ, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లిలో బాధితులకు కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్ శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్‌లను పంపిణీ చేశారు. గుండంపల్లి గ్రామానికి చెందిన బిట్ల హరీష్, లక్ష్మీకి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరమని వివరించారు. ఈ కార్యక్రమంలో తోట మాధవులు, ఖైదం వెంకన్న, పద్మ, నీలం భిక్షపతి పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత ఊరేగింపు



డోర్నకల్‌లో ఊరేగింపుగా వెళ్తున్న దుర్గామాత విగ్రహం

డోర్నకల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : దుర్గాశరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో శనివారం డోర్నకల్‌లో వివిధ మండపాలలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం డోర్నకల్ మున్నేరులో విగ్రహాలను నిమజ్జనంచేశారు.

డోర్నకల్‌లో మోస్తరు వర్షం

డోర్నకల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. డోర్నకల్ పట్టణంలో సుమారు 25 నిమిషాల పాటు వాన పడింది. ఈ అకాల వర్షం వల్ల పత్తి చేలకు నష్టం వాటిల్లనుందని సాగు చేసిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా వర్షం పడడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

బాధితురాలికి బ్యాగు అప్పగింత

కురవి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ఓ ప్రయాణికురాలు బ్యాగును పోగొట్టుకోగా, కురవి పోలీసులు తిరిగి అందించిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ శివనగర్‌కు చెందిన సహానబేగం రైలులో వచ్చి మహబూబాబాద్‌లో దిగింది. కురవి అడ్డా వద్ద ఆటోలో ఎక్కి బేతోలులో దిగింది. తన సోదరుడి ఇంటికి వెళ్లాక ఆటోలో బ్యాగు మరిచిపోయిన విషయాన్ని గమనించి తక్షణమే కురవి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఎస్సై మరిచిపోయిన బ్యాగులో ఉన్న ఫోన్ లోకేషన్ ఆధారంగా ఆటోను గుర్తించిన పోలీసులు చింతపల్లి-ధర్మారం మధ్య ఆటోను పట్టుకుని బ్యాగును స్వాధీనం చేసుకుని చూడగా, అందులో తులం బంగారంతో పాటు రెండు సెల్‌ఫోన్‌లు ఉండడంతో బాధితురాలికి బ్యాగును అప్పగించారు. వేగంగా స్పందించి బాధితురాలుకు బ్యాగును అందించిన కురవి పోలీసులను పలువురు అభినందించారు.

రెక్కల విహారి.. పనిలో నేర్పరి..



- రోజురోజుకూ పెరుగుతున్న డ్రోన్ల వినియోగం
- ఎరువుల పిచికారీలో రైతులకు అండ..
- వేడుక ఏదైనా చిత్రీకరణలో మేటి
- క్రమంగా అన్ని రంగాలకు విస్తరణ

మామునూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అన్నీ తానై.. అన్నింటా తానై.. అన్నట్టుగా డ్రోన్ యంత్రాలు ప్రతీ పనిని సులువుగా చేసిపెడుతున్నాయి. అసాధ్యం అనుకున్న పనులను సుసాధ్యం చేస్తున్నాయి. ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపుతున్నాయి. డ్రోన్ల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. పంటల పర్యవేక్షణ, ఎరువులు, పురుగుమందుల పిచికారీ వంటి పనులన్నీ తక్కువ సమయంలో స్వల్ప ఖర్చుతో చేసి పెడుతున్నాయి. కూలీల కొరతకు పరిష్కరం చూపుతున్నాయి. అదేవిధంగా ఫొటోగ్రఫీ, నిఘా, సరుకు రవాణా, మైనింగ్, నిర్మాణ రంగం, జియోమ్యాపింగ్, రక్షణ, మౌలిక సదుపాయాల తనిఖీ వంటి అనేక రంగాలలో డ్రోన్ల వాడకం పెరిగిపోయింది. ప్రభుత్వం కూడా డ్రోన్ టెక్నాలజీని ప్రోత్సహిస్తోంది.

ప్రత్యేక డ్రోన్లు..

డ్రోన్ల అవసరాన్ని బట్టి రెక్కలు, సామర్థ్యం, రేంజ్, పవ ర్ స్పేర్స్ పరికరాలు ఒక్కో సైజులో ఉంటాయి. అరచేతిలో పట్టేంత దాదాపు 50 సెంటీమీటర్లనుంచి 2 మీటర్ల మధ్య ఉం డే చిన్న డ్రోన్లకు రెక్కలు ఫిక్స్‌డ్‌గా ఉంటాయి. వీటిని ఫొటో గ్రఫీకి వినియోగిస్తారు. 2 మీటర్ల కంటే ఎక్కువ సైజు డ్రోన్లను పారిశ్రామిక అవసరాలకు, వ్యవసాయ రంగాలలో మందుల పిచికారీకి వినియోగిస్తున్నారు. వీటి ధర రూ.20 వేల నుంచి మొదలుకొని రూ.2 లక్షల వరకు ఉన్నాయి.

పెళ్లిళ్ల నుంచి..

సినిమా సన్నివేశాలు, పెళ్లిళ్ల నుంచి రాజకీయ పార్టీ సభలు సమావేశాల చిత్రీకరణకు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. వినియోగదారులకు ఇవి విజువల్స్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తున్నాయి. ప్రీ వెడ్డింగ్ షూట్‌లు, బర్త్‌డే పార్టీలకు వీటిని ఉపయోగించడం సాధారణమైపోయింది. ఒకప్పుడు నేలమీద, పెద్ద పెద్ద స్టాండ్‌లపై దృశ్యాలను కెమెరాలో బంధించే వారు. ఇందులో అనేక ప్రమాదాలు జరిగేవి. డ్రోన్ కెమెరా వచ్చాక ఈ సమస్యలు తగ్గాయి. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ విభాగాల్లో డ్రోన్లు అద్భుతాలు సృష్టిస్తున్నాయి. డ్రోన్లకు కృత్రిమ మేధతోడైతే మన కళ్లముందు మరెన్నో అద్భుతాలను వీక్షించే అవకాశం లేకపోలేదు.



డ్రోన్లతో వ్యవసాయం

పంటపొలాల్లో క్రిమిసంహారక మందుల పిచికారీకి ఎవరూ ముందుకురావడం లేదు. దీంతో రైతులు డ్రోన్ టెక్నాలజీని ఆశ్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సామూహికంగా డ్రోన్లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు పని భారంతో పాటు సమయం, ఖర్చు రెండూ కలిసివస్తున్నాయి. పైగా ఆరోగ్యాన్ని కాపాడుకోగలుగుతున్నారు.

ఆపదలో ఆదుకుంటాయి..

అడవుల్లో అగ్ని ప్రమాదాలు, నదుల్లో ప్రమాద పరిస్థితులను పర్యవేక్షించడానికి, ఎత్తైన భవనాల్లో ప్రమాదం సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవడానికి, వారికి ఆహార పదార్థలు, మందులు అందించడానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి. అభివృద్ధి పనుల పర్యవేక్షణతో పాటు మారుమూల ప్రాంతాల్లో వరద బాధితులకు ఆహారం అందించేందుకు సైతం వీటిని వినియోగిస్తున్నారు. ఆపద సమయంలో సుదూర గ్రామీణ ప్రాంతాలకు వాక్సీన్, మందులను వీటి ద్వారా సరఫరా చేస్తున్నారు. వర్ష ప్రభావం వల్ల పంట నష్టాన్ని అంచనా వేసేందుకు ఇలా ఒకటేమిటి ప్రతీచోటా, అన్ని రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగిపోయింది. నేడు మనిషి జీవితంలో డ్రోన్లు ఒక భాగమైపోయాయంటే అతిశయోక్తి కాదు.

కెనాల్‌లో కొండచిలువ



దూడ, గొర్రెను బంధించిన వైనం

దంతాలపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి, మండల కేంద్రంలో ఓ కొండచిలువ భయభ్రాంతులకు గురిచేసింది. స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్ శివారు దంతాలపల్లి-సూర్యాపేట ఆర్ అండ్ బీ రోడ్డు సమీపంలో డీబీఎం 60 కెనాల్‌లో కొండ చిలువ కనిపించింది. దూడతో పాటు గొర్రెపోతును చుట్టుకొని కొండ చిలువ మింగేస్తూ కనిపించడంతో స్థానికులు భయాందోళన చెందారు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ ఐనప్పటికీ సంబంధిత అధికారులు స్పందించలేదు. ఎవరు కూడా ఎస్సారెస్పీ కెనాల్‌లో ఈతకు, ఇతర పనులకు వెళ్లొద్దని స్థానికులు పేర్కొంటున్నారు.

ఎరక్కపోయి దూరి.. ఇరుక్కొని..



బీరు బాటిల్‌లో తలదూర్చిన పాము

బీరు బాటిల్‌లో తలదూర్చిన పాము వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామోజీ కుమ్మరిగూడెం తండాలోని ఎస్సారెస్పీ కాలువపై ఓ పాము తాగి పడేసిన బీరుబాటిల్ (టిన్ బీర్)లో తలదూర్చింది. బయటకు వచ్చేందుకు ప్రయత్నించినా రాకపోవడంతో చాలా సేపు తల్లడిల్లింది. అలాగే ముందుకు వెనక్కి వస్తూ తీవ్ర ఇబ్బందులకు గురైంది. శనివారం సాయంత్రం అటుగా గీత కార్మికుడు బండారి కుమారస్వామి వెళ్తుండగా ఈ ఘటన చూసి తన ఫోన్‌లో బంధించాడు. పామును బాటిల్‌లో నుంచి తీసేందుకు ప్రయత్నించినా, జేరుగొడ్డు పాము తోకతో కొడుతుందని భయపడి సాహసం చేయలేదన్నాడు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద ఘటన



ప్రమాదానికి కారణమైన కార్లు



మృతి చెందిన జిల్లా హైమ (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వర్ధన్నపేటకు చెందిన మచ్చ రాకేశ్ అనే యువకుడు తన కారులో వరంగల్‌కు వెళ్తున్నాడు. అప్పటికే తన ముందు మరో కారు ప్రయాణిస్తోంది. దానిని ఓవర్‌టేక్ చేసి వెళ్లేందుకు రాకేశ్ ప్రయత్నిస్తున్న తరుణంలో తన ముందు కారు ఒక్కసారిగా ఉప్పరపెల్లి గ్రామం వెళ్లేందుకు కారును మళ్లించాడు. దీంతో రాకేశ్ కారు ఢీకొని వాహనాలు ఒక్కసారిగా చుట్టూ చక్కర్లు కొడుతూ తిరిగాయి. అప్పటికే ఉప్పరపెల్లి గ్రామానికి చెందిన జిల్లా హైమ (38) వర్ధన్నపేటకు వెళ్లేందుకు రోడ్డు పక్కన ఆటో కోసం నిల్చుని ఉంది. కార్లు రెండు ఢీకొని వేగంగా పక్కకు రావడంతో రాకేశ్ నడుపుతున్న కారు హైమకు తగిలింది. ఎగిరి దూరంగా పడిన హైమ తలకు తీవ్రగాయమైంది. స్థానికులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, మార్గం మధ్యలో మృతి చెందింది. ఆమె కుమార్తె జిల్లా శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు.

తలకొరివి పెట్టిన కూతురు..

రోడ్డు ప్రమాద ఘటనలో మృతి చెందిన జిల్లా హైమ గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తోంది. భర్త శ్రీనివాస్ కొన్ని సంవత్సరాల కిందట మృతి చెందాడు. ఒక్కగానొక్క కూతురు శ్రీలతను చూసుకుని ఉంటోంది. శ్రీలతకు వివాహం కాగా, కుటుంబ సమస్యలతో తల్లి వద్దే ఉంది. తల్లి మరణంతో శ్రీలత మనోవేదనకు గురవుతోంది. తల్లికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు సైతం చేయడంతో స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

పత్తి రైతుకు గడ్డుకాలం

(5వ పేజీ తరువాయి)

2025-26లో 36,47,617.85క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. గత ఏడాది క్వింటాల్ పత్తికి రూ.7,521లు ఉండగా, ఈ సీజన్‌లో క్వింటాల్ పత్తికి కేంద్ర ప్రభుత్వం రూ.8,110లను ప్రకటించింది. దీంతో రైతులు సీసీఐ కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే జిన్నింగ్ మిల్లుల యాజమానులు, సీసీఐ మధ్య ఏర్పడిన విభేదాలు పత్తి కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మద్దతు ధరతో కొనుగోలు చేసిన పత్తి నుంచి గింజలు తీసి, బేళ్లుగా మార్చి సరఫరా చేయడానికి సీసీఐ టెండర్లు ఆహ్వానించింది. గత ఆగస్టు 31వ తేదీ వరకు గడువు ఇచ్చినా ఎవరూ ముందుకు రాలేదు. రెండోసారి సెప్టెంబరు 28వ తేదీ వరకు టెండర్లకు గడువు ఇచ్చినప్పటికీ జిన్నింగ్, ప్రెస్సింగ్ టెండర్లకు కాటన్, జిన్నింగ్ మిల్లుల యాజమానులు దూరంగా ఉంటున్నారు. మార్క్‌ఫెడ్ మినహా ప్రైవేటు వ్యాపారులు టెండర్లు వేయకపోవటంతో సీసీఐ కొనుగోళ్లు ప్రశ్నార్థకంగా మారాయి. అక్టోబరు 1వ తేదీ నుంచే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుందని ప్రచారం జరిగింది.

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 4,11,923 మెట్రిక్ టన్నుల పత్తి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సీసీఐ నింబంధనలు కఠినంగా ఉండటంతో తమ మిల్లులను సీసీఐకి అద్దెకు ఇవ్వొద్దని నిర్ణయించింది. ప్రధానంగా వంద కిలోల పత్తిలో ఏ నెల ఎంత దూది ఇవ్వాలనే నింబంధన ఉండేది. అయితే దీనిని గతంలో ఉన్న నెలవారి లెక్కలను కొత్త నిబంధనల ప్రకారం 15రోజులకోసారి ఇవ్వాలని పెట్టారు. అలాగే బేలు తయారు చేసే సమయంలో గతంలో లోటు (షార్టేజ్) 3.15శాతం నుంచి 1.90 శాతం ఉండగా, దాన్ని కొత్త నిబంధనలో 1.25శాతం నుంచి 0.75శాతానికి తగ్గించారు. మిల్లుల ఎల్-1, ఎల్-2 విధానాన్ని గతంలో రద్దు చేయగా, ఈసారి ప్రవేశపెడుతున్నారు. వీటితోపాటు నిబంధనలు, బేళ్ల ధర, జిన్నింగ్‌లో సౌకర్యాలు తదితర వాటిపై చర్చించాకు టెండర్లు పిలువాలని మిల్లుల యాజమానులు పేర్కొంటున్నారు. సీసీఐ నిబంధనలు బూచితో జిన్నింగ్ మిల్లుల యాజమానులు పేచీకి దిగుతుండటంతో పత్తి కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం

ఈ ఏడాది వర్షాలు మే మూడో వారంలోనే పడటంతో రైతులు ముందస్తుగా పత్తి సాగు చేశారు. రోహిణి కార్తెలో రోళ్ల పగిలే ఎండలు ఉంటాయంటారు. కానీ, ఏడాది రోహిణి కార్తెలో వర్షాలు కురియటంతో రైతు ముందస్తుగానే పత్తి విత్తనాలు విత్తారు. ఆ తరువాత ఎండలకు పత్తి మొలకలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. యూరియా కొరతతో పాటు వాన ముసుర్లు పంటలను దెబ్బతీశాయి. వేరు తెగుళ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొత్తానికి తొలి పత్తి గత సెప్టెంబరు మూడో వారంలోనే చేతికి వచ్చింది. కానీ, కష్టాల పంటకు గిట్టుబాటు ధర వెక్కిరిస్తుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

అక్టోబరు 1వ తేదీ నుంచే సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తుందని ప్రచారం జరిగింది. అయితే జిన్నింగ్ మిల్లులు, సీసీఐ మధ్య ఏర్పడిన విబేదాలు రైతులు శాపంగా మారుతోంది. దీంతో చేతికి వస్తున్న పంటను నిల్వ చేసే పరిస్థితి లేదు. వరుసగా కురుస్తున్న వర్షాలకు పంటను ఇంట్లో, చేల్లలో నిల్వ చేయలేని పరిస్థితి. అంతేకాకుండా ముసురుతో పత్తిలో తేమ శాతం తగ్గటం లేదు. ఆర పెట్టేందుకు వాతవారణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవటంతో పాటు సీసీఐ కొనుగోళ్ల ప్రారంభించకపోవటంతో గత్యంతరం లేక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో తక్కువ ధరకు పత్తిని దళారుల చేతిలో పెట్టాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి క్వింటాల్‌కు రూ.8,110ల మద్దతు ధరను ప్రకటించింది.

అయితే నిమ్ము, తేమ, తాలు, బెండ్లు తదితర కారణాలను చూపిస్తు క్వింటాల్ పత్తికి రూ.3వేల నుంచి గరిష్ఠంగా రూ.7వేల వరకే కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే పత్తిచేతికి వస్తుండటంతో రైతులు మార్కెట్‌కు తీసుకెళ్లిన దళారులదే రాజ్యం కావటంతో అడిగిన ధరకు పత్తిని విక్రయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మరోవైపు సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యాజమానుల మధ్య ఎలాంటి చర్చలు జరగకపోవటంతో సమస్య పరిష్కారం అయ్యేదెప్పుడో.. సీసీఐ కొనుగోలు చేసేది ఎప్పుడో.. అని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని, సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మెప్మా రుణాలపై బ్యాంకర్లు కొత్త మెలిక

- రుణం తీసుకునే ప్రతీ మహిళకు ఉద్యమ్ ఆధార్ తప్పనిసరి
- కార్డు పొందడంలో ఇబ్బందులు పడుతున్న సభ్యులు
- పాన్, ఆధార్‌తో కచ్చితంగా అనుసంధానమై ఉండాలన్న నిబంధన
- ఉమ్మడి జిల్లాలో 4.5 లక్షల మంది సభ్యులు
- రూ.1233 కోట్ల మేరకు రుణ వితరణ ప్రతిపాదన


హనుమకొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) లింకేజీ విషయంలో బ్యాంకర్లు కొత్త మెలిక పెట్టారు. రుణం తీసుకునే ప్రతీ మహిళ ఉద్యమ్ ఆధార్ తప్పనిసరిగా కలిగి ఉండాలని చెప్పడంతో వారంతా అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికిప్పుడు ఈ ప్రక్రియ అందరు పూర్తి చేయాలంటే సాధ్యమేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. సాధారణంగా చిన్నతరహా పరిశ్రమలు స్థాపించేవారు తమ వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించేందుకు ఉద్యమ్ ఆధార్‌ను తప్పనిసరిగా తీసుకోవలసి ఉంటుందని బ్యాంకర్లు చెబుతున్నారు. అయితే దీన్ని ప్రభుత్వ రుణంతో స్వయం ఉపాధి పొందే సంఘాలకు కూడా వర్తింపజేయడంతోనే చిక్కొచ్చి పడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఉద్యమ్ ఆధార్ కార్డు తీసుకోవడం ఇబ్బందిగా మారింది. సంఘం తరఫున కనిష్ఠంగా రూ.లక్ష నుంచి అత్యధికంగా రూ.20 లక్షల వరకు రుణం తీసుకునే వారందరూ ఉద్యమ్ ఆధార్ ధ్రువపత్రం తీసుకోవాలన్న నిబంధన విధించడంతో వారంతా అయోమయంలో పడ్డారు.

ఉద్యమ్ ఆధార్ అంటే ?

ఇది మన దేశంలోని సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమల కోసం ఉద్దేశించిన ఒక ఉచిత, కాగిత రహిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ. ఈ రిజిస్ట్రేషన్ అనంతరం ఒక ప్రత్యేకమైన పన్నెండు అంకెల సంఖ్య లభిస్తుంది. ఈ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందడం ద్వారా వ్యాపారాలకు సంబంధించి తక్కువ వడ్డీకి రుణాలు, ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందుతాయి. 2020లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఇబ్బందేమిటంటే ?

ఉద్యమ్ ఆధార్ తీసుకోవాలంటే పాన్‌కార్డుతో పాటు ఆధార్ కార్డు కూడా కలిగి ఉండాలి. పాన్, ఆధార్‌తో కచ్చితంగా అనుసంధానమై ఉండాలి. రుణం తీసుకునేవారు ఏదో ఒక వ్యాపారం నడుపుతున్నట్టుగా ట్రేడ్ లైసెన్సు లాంటి డాక్యుమెంట్లను తీసుకోవాలి. ఇవన్నీ ఉంటేనే ఉద్యమ్ ఆధార్ పత్రాన్ని తీసుకునేందుకు అవకాశముంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలామంది ఎస్‌హెచ్‌జీ సభ్యులకు పాన్ కార్డు ఉన్నప్పటికీ ఆధార్‌తో అనుసంధానం కాలేదు. ఇప్పటికిప్పుడు చేయించుకోవాలన్నా సుమారు 20 రోజులు పడుతుంది. రూ.1500 వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. పాన్, ఆధార్ కార్డుల్లో పేర్లలో ఏ చిన్న తప్పు ఉన్నా మరిన్ని ఇబ్బందులు తప్పవు. ఇదంతా మెప్మా సభ్యులకు భారంగా, కష్టతరంగా మారింది. దీంతో రుణాలను తీసుకునే అవకాశం లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


UDYAM REGISTRATION CERTIFICATE

SERVICES

BE A CHAMPION with the Ministry of MSME

ఉద్యమ్ ఆధార్ రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం

ఉద్యమ్ ఆధార్ నమోదు ఇలా..

మొదట అధికారిక ప్రభుత్వ ఉద్యోగం రిజిస్ట్రేషన్ పోర్టల్ https://udyamregistration.gov.in/లోకి వెళ్లాలి. ఎంఎస్ఎంగా ఇంకా నమోదు చేసుకోని కొత్త వ్యవస్థాపకులు లేదా ఈఎం-2 ఉన్నవారి కోసం అనే దానిపై క్లిక్ చేయాలి. ఆధార్ కార్డులో ఉన్న విధంగా ఆధార్ నెంబర్, వ్యవస్థాపకుడి పేరును నమోదు చేయాలి. తర్వాత వాలిడేట్ అండ్ జనరేట్ ఓటీపీపై క్లిక్ చేయాలి. ధ్రువీకరించిన తర్వాత సంస్థ గురించి అవసరమైన సమాచారాన్ని నమోదు చేయాలి. బ్యాంకు ఖాతా నెంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో సహా సంస్థ బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేయాలి. సంస్థ ప్రధాన వ్యాపార కార్యకలాపాల వివరాలను దాని ఎన్ఐసీ కోడ్‌తో సహా నమోదు అందించాలి. సబ్మిట్‌పై క్లిక్ చేసే ముందు నమోదు చేసిన సమాచారం కచ్చితమైనదని, పూర్తిగా ఉందని నిర్ధారించుకోవాలి. జనరేట్ అయిన ఉద్యోగుల రిజిస్ట్రేషన్ (యూఆర్ఎన్) కోసం రిజిస్టర్డ్ ఈ-మెయిల్ చిరునామా, మొబైల్ నెంబర్‌ను తనిఖీ చేయాలి. యూఆర్ఎన్‌ను ఉపయోగించి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ నుంచి ఈ-సర్టిఫికెట్ లేదా ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

రూ.1233 కోట్ల రుణాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు వీలుగా మెప్మా సభ్యులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1233.84 కోట్ల రుణాలు ఇవ్వాలని ప్రతిపాదించారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 45,000 మెప్మా సంఘాలు ఉన్నాయి. వీటిలో బ్యాంక్ లింకేజీ ద్వారా అర్హత కలిగిన 7,500 సంఘాలకు ఈ రుణాలను అందజేస్తారు. 42 దివ్యాంగ సభ్యుల సంఘాలు రూ.1.38 కోట్లు, 60 వీధి వ్యాపార సంఘాలకు రూ.1.68కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు రుణాలు తీసుకునే ప్రతీ సభ్యురాలు ఉద్యమ్ ఆధార్ ధ్రువీకరణ పత్రాన్ని కచ్చితంగా పొంది ఉండాలి. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 4.50 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరంతా ఉద్యమ్ ఆధార్ పత్రాలను పొందాల్సి ఉంది. ఇంత మంది ఈ పత్రాలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సీవోలు, ఆర్పీలు సహాయం చేస్తున్నారు..

రజిత, మెప్మా డీఎంసీ, హనుమకొండ జిల్లా

స్వయం సహాయక సంఘాల సంఘాల్లోని ప్రతీ మహిళ ఉద్యమ్ ఆధార్ కలిగి ఉండడం తప్పనిసరి చేశారు. హనుమకొండ జిల్లాలో సుమారు 5,500 సంఘాలు, 75వేల మంది ఉన్నారు. వీరిలో చాలా మంది ఇప్పటికే ఉద్యమ్ ఆధార్ ధ్రువపత్రాన్ని పొందారు. ఉద్యమ్ ఆధార్ పొందడంతో సభ్యులకు సీవోలు, ఆర్‌పీఎస్‌లు సహాయం అందిస్తున్నారు. వీరికి శిక్షణ కూడా ఇచ్చాం. కొంచెం ఇబ్బంది అయినా ఉద్యమ్ ఆధార్ పొందడం వల్ల సభ్యులకే లాభం. మెప్మా రుణాలను సులభంగా పొందవచ్చు.

ఆశావహుల్లో జంపింగ్‌లు ఎక్కువ

- తారుమారైన రిజర్వేషన్లు
- ప్రజాసేవ తక్కువ.. సంపాదనపై మక్కువ
- టికెట్ల కోసం పెద్ద సారు చుట్టూ ప్రదక్షిణ



పరకాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా టికెట్లు ఆశించే వారిలో ఇతర పార్టీల నుంచి అధికార పార్టీలోకి వచ్చిన వారే ఎక్కువగా ఉన్నారు. పాత వారిని పక్కన బెట్టి తమకే టికెట్ కావాలంటూ ప్రయత్నాలు సాగిస్తున్నారు. పార్టీ అభివృద్ధి కోసం పైసా ఖర్చు పెట్టకుండా, ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించని వారు తమకు ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్‌తో పాటు పరకాల మునిసిపల్ పరిధిలో రాబోయే కౌన్సిలర్ ఎన్నికలకు కూడా టికెట్లు కావాలని తిరుగుతున్నారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీతో లబ్ధి పొందిన వారు సైతం నేడు అధికారంలో ఉన్న పార్టీలో చేరి ఎంతో కొంత సంపాదించుకోవాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఏళ్ల తరబడి పార్టీని పట్టుకొని పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసి ఎన్నో సాధకబాధకాలకు ఓర్చిన వారు ప్రస్తుతం పక్కకు జరుగుతున్నారు. తమకు అనుకున్న న్యాయం జరగడం లేదని ఆలోచన చేసి ఎవరికి టికెట్ ఇవ్వాలి.. ఇవ్వకూడదో తప్పనిసరిగా అధిష్ఠానం ఆలోచించాలని పాత క్యాడర్‌కు చెందిన నాయకులు కోరుతున్నారు.

టికెట్ల కోసం పెద్ద సారు చుట్టూ ప్రదక్షిణ

తమకే టికెట్ కేటాయించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చుట్టూ ఆశావహులు ప్రదక్షిణలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల నాయకుల పేర్లను సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థులుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఏ కార్యక్రమానికి విచ్చేసినా రోజుల తరబడి తమ పనులు వదులుకొని ఎమ్మెల్యే నిర్వహించే కార్యక్రమాల్లో ఆశావహులు పాల్గొంటున్నారు. ఎమ్మెల్యే కంటికి కనిపిస్తూ రోజంతా కార్యక్రమాల్లోనే కొనసాగుతున్నారు. టికెట్ ఎవరికి వస్తుందోనని ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. మరికొంత మంది ఇప్పటికే ఎంత ఖర్చు అవుతుంది? ఎన్ని ఓట్లు ఉన్నాయి? మన వారు ఎందరు? ఇతర పార్టీల ఓటర్లు ఎందరు? అని లెక్కలు వేసుకుంటున్నారు. దీంతో ప్రతిరోజూ కూడళ్ల వద్ద ఎన్నికలపైనే ముచ్చట్లు కొనసాగుతున్నాయి. గ్రామంలో సరైన నాయకులు ఎవరున్నారు ? ఎవరు గెలుస్తారు ? ఎవరికి టికెట్ వచ్చే అవకాశం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది. ఏది ఏమైనా ఎన్నికల నిర్వహణపై గ్రామాల్లో ఉత్కంఠ నెలకొంది.

పరకాల మండలంలో రిజర్వేషన్లు ..

ప్రస్తుతం పరకాల మండల స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి.. లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ బీసీ మహిళ, ఎంపీటీసీ జనరల్ మహిళ, వెంకటాపురం సర్పంచ్ జనరల్, హైబోత్‌పల్లి సర్పంచ్ జనరల్ మహిళ, నాగారం సర్పంచ్ బీసీ జనరల్, ఎంపీటీసీ బీసీ జనరల్, మల్లక్కపేట సర్పంచ్ ఎస్సీ మహిళ, ఎంపీటీసీ ఎస్సీ జనరల్, పైడిపల్లి సర్పంచ్ ఎస్సీ జనరల్, వెల్లంపల్లి సర్పంచ్ ఎస్సీ జనరల్, ఎంపీటీసీ జనరల్, పోచారం బీసీ జనరల్, ఎంపీటీసీ బీసీ మహిళ, అలియాబాద్ సర్పంచ్ జనరల్, కామారెడ్డిపల్లి సర్పంచ్ బీసీ మహిళగా రిజర్వేషన్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో ప్రజాప్రతినిధులుగా కొనసాగిన వారు రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తాయని తిరిగి పదవులు తమకు ఉంటాయని ఆశించారు.

కానీ, రిజర్వేషన్లు తారుమారు కావడంతో తమ నమ్మిన బంటులను గెలిపించుకునేందుకు సిద్ధమవుతున్నారు. జడ్పీటీసీ జనరల్, ఎంపీటీసీ జనరల్‌గా కేటాయించారు.

మాస్‌లైన్ అభ్యర్థులను ఆదరించండి

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ అభ్యర్థులను ఆదరించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాయం చిన్నచంద్రన్న విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లోని మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదు జడ్పీటీసీలు, 15 ఎంపీటీసీలు, 20 సర్పంచ్ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. పేద ప్రజల అభివృద్ధి కోసం పని చేసిన మాస్‌లైన్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం, పూనెం ప్రభాకర్, ముంజంపల్లి వీరన్న, ఉమ్మగాని సత్యం, నర్సింహారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పాత బజారులో ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నందినగర్, గుండ్లకుంట కాలనీ, ఆర్టీసీ కాలనీ, గిరిప్రసాద్‌నగర్, కంకరమిల్లు తండా, ఏటిగడ్డ తండా, రాంచంద్రాపురం కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ రోడ్, స్నేహనగర్, ఆకుల లక్ష్మయ్యకాలనీ, అంబేద్కర్ కాలనీల్లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు చెప్పారు.

● మహబూబాబాద్ కొత్తబజారులోని బాబునాయక్ తండా, పత్తిపాక, రజాలిపేట ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏఈ హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మునిగలవీడులో సమావేశమైన పూర్వ విద్యార్థులు


అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో టీచర్లను సన్మానిస్తున్న విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని అనంతారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2004-05 విద్యాసంవత్సరంలో 5వ తరగతి విద్యనభ్యసించిన పూర్వవిద్యార్థులు శనివారం అపూర్వసమ్మేళనాన్ని ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు అనిత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయుడు గుగులోతు కిషన్‌నాయక్ మాట్లాడారు. నాడు పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. విద్యార్థులు ప్రతీ రోజు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను నేర్చుకొని, ఉన్నత విద్యనభ్యసించారని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను గుర్తుంచుకొని సన్మానించడం వారికి గురువుల పట్ల ఉన్న అభిమానం వర్ణించలేనిదన్నారు. ఆనాటి హెచ్‌ఎం కిషన్‌నాయక్, ప్రస్తుత హెచ్‌ఎం అనితకు విద్యార్థినులు కాళ్ల కడిగి పాదాభివందం చేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు రాజేందర్, అనూష, సురేష్, రమ్యశ్రీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సింధుజ, కృష్ణవేణి, యమున, కల్యాణి, సౌజన్య, స్వప్న, నాగమణి, హేమలత, రజిత, రాజు పాల్గొన్నారు.

మునిగలవీడులో..

● నెల్లికుదురు : మండలంలోని మునిగలవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006-07 పదో తరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పూర్వ గురువులను శాలువాలతో సన్మానం చేశారు. మెమెంటోలతో సత్కరించారు. పూర్వం పాఠశాలలో గడిపిన రోజులను గుర్తు చేసుకున్నారు. పూర్వవిద్యాలందరు ఒకచోట కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకొని ఆప్యాత, అనురాగాలను పంచుకొన్నారు. తమ కుటుంబాల యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గురువులు పాల్గొన్నారు.


కేసముద్రంలో మామ రాజలింగం విగ్రహాన్ని ఆవిష్కరించిన అల్లుడు రమేష్, కుటుంబసభ్యులు

మామ జ్ఞాపకార్థం జీవకళ ఉట్టిపడే విగ్రహం

కేసముద్రం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్‌కు చెందిన నర్సింగం రాజలింగం జ్ఞాపకార్థం జీవకళ ఉట్టిపడే విగ్రహాన్ని ఆయన కూతురుఅల్లుడు జనిగల హైమ,రమేష్ దంపతులు చేయించి ఆవిష్కరించారు. స్థానికుడైన రాజలింగం గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందగా ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చెల్క వద్ద ఈ విగ్రహాన్ని కుటుంబసభ్యుల సమక్షంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజలింగం భార్య ఐలమ్మ, కుమారులు మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

గూడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే స్థానిక ఎన్నికలకు సంబంధించి గ్రామ పంచాయతీల వారీగా తుది ఓటర్ల జాబితాను ఖరారు చేసినట్లు చెప్పారు. జీపీల వద్ద అధికారులు ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా, వాటి అభ్యంతరాల స్వీకరణ అంశాలపై సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ నాగభవాణి, ఎంఈవో రవికుమార్, ఎస్సై గిరిధర్‌రెడ్డి, హెచ్‌ఎం సుజాత పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి


మృతి చెందిన గేదె

గూడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన సంఘటన మర్రిమిట్ట శివారు బందాలగడ్డలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. బందాలగడ్డకు చెందిన బానోత్ వెంకన్నకు చెందిన పాడిగేదె వ్యవసాయ పంట క్షేత్రంలోని కరెంట్ వైరు తగిలి ఒక్కసారిగా విద్యుత్ ఘాతంకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె మృతితో తనకు సుమారు రూ. 60 వేలనష్టం వాటిల్లిందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని వెంకన్న విజ్ఞప్తి చేశారు.

ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి : డీఈ


విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఈ విజయ్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రైతు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని డీఈ విజయ్ అన్నారు. మహబూబాబాద్ మండలం కొమ్ముగూడెం గ్రామంలో శనివారం విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పంపుసెట్ల మోటార్లకు ఎర్తింగ్ చేయించుకోవాలన్నారు. ప్రతీ ఇంటికి నాణ్యతతో కూడిన సర్వీస్ వైరు, విద్యుత్ పరికరాలను ఉపయోగించాలన్నారు. ప్రతీ ఒక్కరు విద్యుత్ భద్రత సూత్రాలనుపాటిస్తూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలన్నారు. పొలంబాట కార్యక్రమంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఏఈ వెంకటేశ్వర్లు, రవీందర్‌రెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్త అరెస్టు

● వివరాలు వెల్లడించిన సీఐ సత్యనారాయణ


నిందితుడి అరెస్ట్‌ను చూపుతున్న సత్యనారాయణ

నెల్లికుదురు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : భార్యను గొడ్డలితో నరికి హత్యచేసి పరారైన కేసులో నెల్లికుదురు డీమార్టు సమీపంలో నిందితున్ని పట్టుకొని, శనివారం అరెస్ట్ చేసినట్లు కేసముద్రం సీఐ సత్యనారాయణ తెలిపారు. నెల్లికుదురు పోలీస్‌స్టేషన్‌లో హత్యకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆలేరు గ్రామానికి చెందిన చీకటి స్వప్న (38) తనభర్త నరేష్ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. స్వప్న కిరాణం షాపు నిర్వహిస్తుంది. నరేష్ తాళ్ల ఎక్కుతూ కల్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 2న చీకటి స్వప్నపెద్దకుమారు చీకటి విక్రం దసరా పండుగ రోజున స్నేహితులతో మద్యంతాగి అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. తండ్రి నరేష్ ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని ఈనెల 3న ఉదయం తనపెద్ద కుమారుడు విక్రంను తన వద్దకు పిలిపించుకొని చిన్నతనంలో తాగి అర్ధరాత్రి ఇంటికి వస్తావా, అసభ్యకంగా ప్రవర్తిస్తున్నావని కుమారునిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో తండ్రి కొడుకుల మధ్య గొడవ జరిగింది. గొడవ పెట్టుకోవద్దని తండ్రి కొడుకుల మధ్య కు స్వప్న వెళ్లి విడిపిస్తున్న క్రమంలో మద్యం తాగివచ్చిన కుమారునికి మద్దతు పలుకుతావా, నీ వల్లనే అతడు చెడు వ్యసనాలకు బానిస అవుతున్నాడని నరేష్ క్షణికావేశంలో ఇంట్లో ఉన్న గొడ్డలితో ఆమె మెడపై నరకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు సోదరి మాచర్ల ఉమ ఫిర్యాదు మేరకు కేసు ఎస్సై రమేష్‌బాబు కేసు నమోదు చేయగా, శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్‌బాబు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం : బీజేపీ


బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్

డోర్నకల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్ అన్నారు. శనివారం డోర్నకల్ బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో పూర్తివైఫల్యం చెందిందన్నారు. ఆరుగ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంపై నేపం మోపుతున్నారని విమర్శించారు. గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెళ్లలేని పరిస్థితి ఉందని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. బీజేపీ పార్టీ పట్ల ప్రజలు గ్రామాల్లో సైతం ఆదరణ ఉందన్నారు. ఈ సమావేశంలో డోర్నకల్ రూరల్ పార్టీ అధ్యక్షుడు గణేష్‌నాయక్, టౌన్ పార్టీ అధ్యక్షులు దేవాసింగ్‌నాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాయల రాంబాబు, నెలకుర్తి సతీష్, లకన్‌వ్యాస్, జిల్లా కార్యదర్శి సింగారపు సతీష్, నాయకులు బాసాని నాగేష్, రెహమాన్, నంజాల అశోక్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోసమే సీపీఎం పోరాటం

కేసముద్రం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాలకులను ప్రశ్నిస్తూ ప్రజల సంక్షేమం కోసం వారి తరఫున సీపీఎం పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు అన్నారు. కేసముద్రం కార్యాలయంలో శనివారం నీరుటి జలేందర్ అధ్యక్షతన ఆ పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో ఐదు చొప్పున ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యుడు మార్తినేని పాపారావు, మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, చాగంటి కిషన్, మోడెం వెంకటేశ్వర్లు, అల్బుగొండ సావిత్ర, జల్లె జయరాజు, తాడబోయిన శ్రీశైలం, సోమారపు ఎల్లయ్య, ముద్రకోల శ్రీను, శేఖర్, సారయ్య, కేశ్యా, జ్యోతి, నాగమణి పాల్గొన్నారు.


హైదరాబాద్‌లో పురస్కారాన్ని అందుకుంటున్న కేసముద్రం అయ్యప్ప అన్నదాన సేవా సొసైటీ బాధ్యులు

అయ్యప్ప అన్నదాన సేవా సొసైటీకి పురస్కారం

కేసముద్రం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం శ్రీధర్మశాస్త్ర దేవాలయంలో 15 ఏళ్లుగా మాలధారణ చేసిన స్వాములకు ఏటా 45 రోజుల పాటు అన్నదానం చేస్తున్నందుకుగాను అయ్యప్ప అన్నదాన సేవా సొసైటీకి అన్నపూర్ణ పురస్కారం-2025 లభించింది. హైదరాబాద్ త్యాగరాయ గానసభలో శనివారం సుధగాని రాజుగౌడ్ మహాశాస్త సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని కేరళ మేల్‌శాంతి మురళీనంబూద్రి, మలయాళ తాంత్రిక పీఠాధిపతి శివనర్సింహన్ తాంత్రి అందజేశారు. కేసముద్రం గురుస్వాములు కొత్తపల్లి శేఖర్, జనగాం వెంకట్‌గౌడ్, రుద్ర శ్రీకాంత్‌లకు గురు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో అన్నదాన సేవా సొసైటీ అధ్యక్షుడు వేలం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పొలెపల్లి యాకూబ్‌రెడ్డి, కోశాధికారి బోగోజు నాగేశ్వరాచారి, ఆలయ ధర్మకర్త చింతా నాగేశ్వర్‌రావు, వాంకుడోత్ బిచ్యానాయక్, చింతా సాయికిరణ్ పాల్గొన్నారు.

'ప్రజలకు చేరువలో న్యాయసేవలు'

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల వద్దకే న్యాయ సేవలు అందుబాటులోకి వచ్చినప్పుడే ఆర్థికంగా, వెనుకబడిన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని జిల్లా కోర్టు అదనపు సీనియర్ సివిల్ జడ్జీ కృష్ణతేజ్ అన్నారు. మహబూబాబాద్‌ల మండలం కంబాలపల్లి గ్రామంలో శనివారం లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భం గా జిల్లా కోర్టు అదనపు సూనియర్ సివిల్ జడ్జీ కృష్ణతేజ్ మాట్లాడుతూ ఎవరైనా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారు ఏదేని విషయంలో తాము న్యాయాన్ని పొందలేనప్పుడు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని ఆశ్రయిస్తే ఎలాంటి ఖర్చు లేకుండానే ప్రతి వాదులకు నోటీసులు పంపించి తద్వారా న్యాయాన్ని అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై దీపికారెడ్డి, పంచాయితీ కార్యదర్శి మయూరి, లీగల్ వలంటీర్లు దొంతు శ్రావణ్‌కుమార్, కొత్తపల్లి సిద్దార్థ, గ్రామస్థులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంతోనే మానసిక ప్రశాంతత

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ ఆరోగ్యంతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని డాక్టర్ బండి రాధికారెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో శనివారం లయన్స్ క్లబ్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో 'మానసిక ఆరోగ్యం లేనిదే శారీరక ఆరోగ్యం లేదు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం చేపట్టి 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో నిత్యం పనిఒత్తిడితో సతమతమవుతూ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తున్నారని, ఆరోగ్యంగా ఉంటేనే ఆనందంగా ఉంటారని తెలిపారు. ప్రతీ రోజు వ్యాయామం చేసి మానసికంగా దృఢంగా ఉండాలని పేర్కొన్నారు. మూఢ నమ్మకాలను నమ్మవద్దని, వైద్యులను సలహాలు పాటిస్తూ మానసిక ఒత్తిడని తగ్గించుకోవాలని సూచించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'నో హెల్త్ వితౌట్ మెంటల్ హెల్త్' అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వీరన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు మాదవపెద్ది వెంకటరెడ్డి, పర్కాల రవీందర్‌రెడ్డి, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, అనుమాల వెంకటేశ్వర్లు, వెనిగళ్ల జగన్మోహన్‌రావు, ఘనపురపు అంజయ్య, బవిరిశెట్టి నాగేశ్వర్‌రావు, మాలే కాశీనాథ్, పారుపల్లి రమేష్, చౌడవరపు సుధాకర్, వివిధ సంఘాల బాధ్యులు బొడ్డుపల్లి ఉపేందర్, కామ సంజీవరావు, నల్లు సుధాకర్‌రెడ్డి, పరందామయ్య, పాలబిందెల మల్లయ్య, ఆకుల శంభయ్య, ఆకుల రాజు, వంగ రామన్న, కొల్లూరి రవికుమార్, ఆరీఫ్ పాల్గొన్నారు.


డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికైన డోలి సంధ్య, మెడికల్ సీటు సాధించిన వాసం దేదీప్యను సన్మానిస్తున్న కాళోజీ వాకర్స్ బాధ్యులు

'లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలు'

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రూప్-2 ఫలితాల్లో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగం సాధించిన డోలి సంధ్య, మెడిసన్‌లో సీటు సాధించిన వాసం దేదీప్యను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదరికంలో పుట్టి అనేక ఒడిదొడుకులను అధిగమించి డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికైన సంధ్యను అభినందిస్తూ భవిష్యత్‌లో సివిల్స్ లక్ష్యంగా ప్రయత్నించాలని సూచించారు. అదే విధంగా తొలి ప్రయత్నంలోనే మెడికల్ సీటు సాధించిన దేదీప్య ఆదివాసీ, నిమ్నవర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సోమ విష్ణువర్ధన్, మైస శ్రీనివాస్, వాసం లక్ష్మయ్య, డోలి వెంకటేశ్వర్లు, పొనుగోటి రామకృష్ణరావు, మధుసూదన్‌రెడ్డి, దామోదర్, రాజన్న, శ్రీనివాస్‌రెడ్డి, బూర్ల ప్రభాకర్, దేవేందర్‌రెడ్డి, వెంకన్న, శ్రీహరి, చంద్రమౌళి, నాగేశ్వరరావు, రవీందర్ పాల్గొన్నారు.


దుర్గాదేవీ శోభాయాత్రలో పాల్గొన్న కళాకారులు

ఘనంగా దుర్గామాత శోభాయాత్ర

ఇనుగుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో లక్ష్మీనర్సింహస్వామి గుడి సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహ శోభాయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. చావడి మీదుగా చిన్నబస్టాండ్, పెద్దబస్టాండ్ సెంటర్‌ల నుంచి ఊరేగింపు కొనసాగింది. కేరళ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి డోలు, వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఊరేగింపులో ఆకట్టుకున్నాయి. అనంతరం బేడిచెరువులో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. తిరునహరి కృష్ణమాచార్యులు, వద్దిరాజు వెంకటేశ్వర్లు, ఒద్దిరాజు వసంతరావు, గంజి యాకూబ్‌రెడ్డి, లింగాల నర్సయ్య, నరెడ్ల ఉమ, వజినెపల్లి శ్రీధర్, బైస ఉపెందర్, గొల్లపల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

పాలకుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పని చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని వావిలాల, కొండాపురం ఎంపీటీసీ ఏరియా పరిధిలోని గ్రామాల్లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ముఖ్యంగా రైతుబంధు, రైతు రుణమాఫీ, ఉచిత బస్సు, సన్న బియ్యం లాంటి పథకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గిరగాని కుమారస్వామి, లావుడ్యా మంజుల, కోల వేణు, గంగు కృష్ణమూర్తి, గడ్డం యాకసోమయ్య, కారుపోతుల శ్రీనివాస్ ఉన్నారు.

రసాయన ఎరువులను అతిగా వాడొద్దు


పాలకుర్తిలోని పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పాలకుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు రసాయనిక ఎరువులను అతిగా వాడొద్దని కేంద్ర సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ ఇన్‌చార్జి (సీఐపీఎంసీ) సునీత అన్నారు. శనివారం పాలకుర్తి మండకేంద్రంలోని రైతు వేదికలో రెండురోజుల పాటు సమగ్ర సస్యరక్షణపై రైతులకు అగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సునీత హాజరై మాట్లాడుతూ వ్యవసాయంలో పంట మార్పిడితో దిగుబడి అధికంగా వస్తుందని అన్నారు. అదే విదంగా విత్తనశుద్ధితో అనేక ఉయోగాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు పాటించాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలను తప్పకుండా తీసుకోవాలని అన్నారు.

పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా ఆమె వివరించారు. క్షేత్రాల్లో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి వాటి వాడకాన్ని కూడా వివరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, ఉదయ్‌శంకర్, బసవన్న, ఏడీఏ పరుశరాం, మండల వ్యవసాయాధికారి శరత్‌చంద్ర, ఏఈవో రాధిక, రైతులు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు నగదు ప్రోత్సాహం

పాలకుర్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూడూరు జడ్పీఉన్నత పాఠశాలలో 2024-2025లో టెన్త్‌లో 564 అత్యధిక మార్కులతో మండల స్థాయిలో కూడా టాపర్‌గా నిలిచిన మాచెర్ల శ్రీజకు రూ. 5 వేలు, ద్వితీయ స్థానంలో పాఠశాల స్థాయిలో 542 మార్కులతో నిలిచిన మధుకర్‌కు రూ. 3 వేల నగదును డాక్టర్ చుక్కా రామయ్య ట్రస్టు ఛైర్మన్ మాచెర్ల పుల్లయ్య ఆధ్వర్యంలో శనివారం అందచేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ మాట్లాడుతూ సర్కార్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తే చదువులో ముందంజలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమలో యాకలక్ష్మీ, నిర్మల, చంద్రమోహన్, ఫాతీమా, రమేష్ బాబు, శ్రీనివాస్, పద్మ, నజియా, రాణి, యాదగిరి, భాస్కర్, కుమార్ ఉన్నారు.